క్లుప్తంగా

వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు



పెడన: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని పలు రహదారులు, అంతర్గత రహదారులు, లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. పెడనలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 3.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య శానిటరీ కార్యదర్శులతో ఆయా వార్డుల్లో పర్యటించి ముంపు ప్రాంతాల్లో నిలిచిన నీటిని డ్రెయిన్లలోకి పంపించేలా సిబ్బందితో చర్యలు చేపట్టారు. రామలక్ష్మి వీవర్స్ కాలనీ, మెయిన్ రోడ్డు, బ్రహ్మపురం తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటరీ కార్యదర్శులను అప్రమత్తం చేశారు. మిగిలిన ప్రాంతాలను కూడా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

రైతులకు వడ్డీ రాయితీ చెక్కుల పంపిణీ



కృత్తివెన్ను: బ్యాంకులో వ్యవసాయానికి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులకు వర్తించే వడ్డీ రుణమాఫీ చెక్కులను శనివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు. కృత్తివెన్నులోని శ్రీ కృష్ణా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నందు జరిగిన కార్యక్రమంలో రైతులకు చెక్కులను అందించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మాఫీ పథకంలో భాగంగా వచ్చే 3 శాతం వడ్డీ రాయితీని 2020-21, 2021-22 సంవత్సరాలకు గాను మొత్తం 279 మంది రైతులకు రూ.6,09,418లను అందజేయనున్నట్లు బ్యాంకు మేనేజర్ వెంకటరమేష్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సీఈవో సత్యనారాయణ, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కందిపప్పు, బియ్యం విక్రయాలు ప్రారంభం



మోపిదేవి: సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రం మోపిదేవి ప్రధాన సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు తక్కువ ధరకు విక్రయించేందుకు దుకాణం ఏర్పాటు చేసి, విక్రయాలను ప్రారంభించారు. కందిపప్పు రూ.160, బాయిల్, పచ్చి బియ్యం రకాలు రూ.48, రూ.49లకే ప్రభుత్వం అందిస్తుందన్నారు. వీఆర్వో మూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తక్కువ ధరలకు నిత్యావసర సరుకులు

కోనేరుసెంటర్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిత్యావసర సరుకులను తక్కువ ధరలకు విక్రయించేందుకు నగరంలోని పలు దుకాణాలను ఎంపిక చేసినట్లు బందరు తహసీల్దార్ కె.విజయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోనా మసూరీ రా రైస్ కేజీ రూ.48, సోనా మసూరి స్టీమ్ రైస్ రూ.49, దేశవాళీ కందిపప్పు రూ.160లకు విక్రయిస్తున్నామన్నారు. నగరంలోని డి మార్ట్, విశాల్ మార్ట్, రిలయన్స్ మార్ట్, రైతు బజార్, వాణి జనరల్ స్టోర్స్, ఎస్ఆర్ జనరల్ స్టోర్స్ తదితర దుకాణాల్లో నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

రైతులకు పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలి




కృత్తివెన్ను: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ప్రకటించిన రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలను వెంటనే అందించాలని ఏపీ రైతుసంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు కోరారు. రాష్ట్ర రైతు, కౌలురైతు, వ్యవసాయ సంఘాల పిలుపు మేరకు శనివారం ఆయన మండలంలోని నీలిపూడి, యండపల్లి, చినపాండ్రాక సచివాలయాల్లోని కార్యదర్శులకు రైతులతో కలసి వినతి పత్రాలను అందజేశారు. మిచాంగ్ తుఫాన్ నష్టపరిహారం, పంటల బీమా పరిహారం ఇవ్వాలని, కౌలురైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డులు ఇచ్చి బ్యాంకుల ద్వారా పంట రుణాలను మంజూరు చేయించాలని వినతి పత్రంలో కోరారు. ఉపాధి హామీ పథకం పని దినాలను 200 రోజులకు పెంచాలని రోజువారీ వేతనాన్ని రూ.600 చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతులు పుప్పాల నరసింహారావు, పాశం పాండురంగవిఠల్, నాగబాబు, నవీన్‌కుమార్, సీఐటీయూ నాయకుడు మాజేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపులో లోతట్టు ప్రాంతాలు



జల్లు వారి తోట ప్రాంతంలో నిలిచిపోయిన వర్షపు నీరు



హిందూ శ్మశానవాటిక వెనుక ప్రాంతంలో దుస్థితి

- పొంచి ఉన్న వ్యాధులు
- అప్రమత్తం కాకుంటే తప్పని ప్రమాదం
- గుర్రపుడెక్క, సిల్టుతో నిండిపోయిన డ్రెయిన్లు

మచిలీపట్నంటౌన్: అల్పపీడన ద్రోణి కారణంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో నగరం తడిచిముద్దయ్యింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నివాస ప్రాంతాల్లో ఉన్న ఖాళీస్థలాలు నీటితో నిండాయి. నివాసాల మధ్యన తటాకాల్లా తయారైన ఇవి దోమల వృద్ధికి ఆవాసాలుగా మారాయి. నగరంలో దాదాపు 3,139 ఖాళీస్థలాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా నివాసాల మధ్య పల్లపు స్థలాలే ఉన్నాయి. ఈ స్థలాలన్నీ వర్షపునీటితో నిండాయి. ఈ నీరు ఎటూ కదలకుండా నిలకడగా ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. ఇవి పగలు, రాత్రి తేడా లేకుండా స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

అధికమవుతున్న సమస్యలు..

ఖాళీ స్థలాల్లో వర్షపునీరు చేరి దోమలు, ఈగలు వృద్ధి చెంది స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది వైరల్, మలేరియా జ్వరాలతో ఇబ్బంది పడుతూ ఆస్పత్రుల బాటపట్టారు. ప్రభుత్వాస్పత్రికి ప్రతిరోజు 10 నుంచి 15 మంది జ్వరపీడితులు ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరిన్ని పల్లపు ఖాళీస్థలాలు ముంపు బారినపడటంతో సమస్యలు అధికమవుతున్నాయి.

చర్యలు చేపట్టాలి..

నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటిని తొలగించేందుకు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టాల్సి ఉంది. నగరంలో పలు ప్రైవేటు, ప్రభుత్వ పల్లపు ప్రాంతాల్లో నీరు ప్రతి రోజు పెరుగుతుంది. నీటిని తొలగించిన అనంతరం ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించటంతో పాటు దోమలు, ఈగల నివారణకు మందును పిచికారీ చేయించాల్సి ఉంది. ఆ దిశగా నగరపాలక సంస్థ ఇంకా చర్యలు చేపట్టలేదు.



కేంద్రీయ విద్యాలయం వద్ద నిలిచిన వర్షపునీరు



ఆదర్శనగర్ వద్ద శివారు డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

సిల్టు, గుర్రపుడెక్కతో ఇక్కట్లు..

నగరంలోని ప్రధాన రహదారి వెంబడి ఉన్న డ్రెయిన్లలో అరకొరగా పూడికతీత పనులు జరిగాయి. అయితే నగరంలో కురిసిన వర్షపునీరు ప్రవహించే ప్రధాన డ్రెయిన్లతో పాటు ఈ డ్రెయిన్ల శివారు ప్రాంతాల్లో సిల్టు, గుర్రపుడెక్క పెద్ద ఎత్తున పేరుకుపోయింది. దీంతో డ్రెయిన్లలో వర్షపునీరు ఉధృతంగా ప్రవహించలేని పరిస్థితి నెలకొంది. సబ్‌జైలు డ్రెయిన్ నుంచి వర్షపునీరు తొలగించేందుకు శివారు ప్రాంతంలో గుర్రపుడెక్క పెద్ద ఎత్తున పేరుకుపోవటంతో ఇబ్బంది తలెత్తుతోంది. నగరంలోని చాలా ప్రాంతాల వర్షపునీరు త్వరితగతిన తొలగిపోవటానికి ఇదొక కారణంగా ఉంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్టు, గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

30న క్యాన్సర్‌పై అవగాహన, నిర్ధారణ శిబిరం

నాగాయలంక: స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన విజయవాడలోని మణిపాల్ ఆస్పత్రి సహకారంతో నాగాయలంకలో క్యాన్సర్‌పై అవగాహన, నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ శనివారం తెలిపారు. స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఆస్పత్రికి చెందిన క్యాన్సర్ స్క్రీనింగ్ బస్‌తో వచ్చి రొమ్ము క్యాన్సర్ పరీక్ష, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా చేస్తారన్నారు. 40 ఏళ్లు పైబడిన మహిళలు ఈ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. మహిళలు అన్ని అపోహలు వీడి శిబిరం వద్దకు వచ్చి డాక్టర్‌ను సంప్రదించవచ్చునని చెప్పారు. ఈసందర్భంగా గుండెవ్యాధి నిర్ధారణ, ఉచిత ఈసీజీ, ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. సంబంధిత వైద్య పరీక్షల వివరాలకు 94906 36466, 70936 17778 నంబర్లలో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని రఘుశేఖర్ చెప్పారు.

రామాలయంలో మంత్రి రవీంద్ర పూజలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని బందరుకోటలో వేం చేసి ఉన్న శ్రీ కోదండ రామాలయంలో రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేద ఆశీర్వాదం అందజేశారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించేలా ఆశీస్సులు అందించాలని మంత్రి పూజలు నిర్వహించారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు



విశేష అలంకరణలో సాయిబాబా

నేడు శోభాయాత్ర

పెడన: గురుపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలో వేం చేసి ఉన్న శ్రీగంగాపార్వతీ సమేత ఆగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు శ్రీసత్యసాయి సేవా సమితి శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పూజాది కార్యక్రమాలు అనంతరం పెడన బస్టాండ్ నుంచి శివాలయం వరకు శోభాయాత్ర జరుగుతుందన్నారు.

కోడూరు: కోడూరు షిర్డిసాయి దివ్యజ్ఞాన ధ్యాన మందిరం నందు ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు మందిర కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఉదయం సాయిబాబా విగ్రహానికి భక్తులే స్వయంగా క్షీరాభిషేకం చేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులచే సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, గురు సత్కారాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్న హారతి అనంతరం సాయిబాబాకి పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

సాయి మందిరంలో నేడు వేడుకలు

నాగాయలంక: గురుపౌర్ణమి పురస్కరించుకుని స్థానిక షిర్డి సాయిబాబా దివ్యజ్ఞాన మందిరంలో ఆదివారం వేడుక నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వర్రే సుమన్, బ్రహ్మశ్రీ అంబా సాయి కిరణ్‌శర్మ శనివారం తెలిపారు. అఖండ ఓం సాయి నామ జ్ఞాన సంకీర్తన, ఉదయం బాబావారికి కాగడ హారతి, విశేష మహన్యాస పూర్వక ఏకాదశ రుద్ర అభిషేకాలు, సహస్ర నామార్చన, మహా నివేదన, భక్తులందరికీ అన్న సంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

25న చెరువులు, దుకాణాల వేలం

పెడన: పురపాలక సంఘ పరిధిలోని నాలుగు చెరువులు రెండేళ్ల లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 25న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న వేలం నిర్వహించగా ఎవరూ రాలేదని, దీంతో 25న వేలం నిర్వహిస్తున్నామన్నారు. పెడనలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన కొత్త చెరువు, గుడివాడ రోడ్డులోని తాత్కాలిక డంపింగ్‌యార్డు పక్కన తామర చెరువు, టీడీపీ పాలెంలోని వాటర్ వర్క్స్ పక్కన కొలుకుల వారి చెరువు, పదో వార్డులోని మల్లి చెరువులలో చేపలు పెంచుకుని పట్టుకునేందుకు సర్వహక్కులు కల్పిస్తూ లీజుకు ఇస్తున్నామని చెప్పారు. సాల్వెన్సు, డిపాజిట్లు వివరాలను మున్సిపల్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో చూసుకోవాలని సూచించారు. అలాగే పట్టణంలో ఖాళీగా ఉన్న 18 మున్సిపల్ దుకాణాలు, వీటిని ఆయా రిజర్వేషన్ల ప్రకారం అద్దెకు ఇస్తామన్నారు. మహిళా వాణిజ్య సముదాయంలో ఆరు, శ్రీమహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లో మూడు, బంటుమిల్లి రోడ్డు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండు, పాత కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏడు ఖాళీలున్నాయన్నారు. మహిళా, జనరల్, ఎస్సీ, ఎస్టీలు వారీగా ఆయా దుకాణాలు కేటాయిస్తామని చెప్పారు. రిజర్వేషన్లకు సంబంధించి పూర్తి వివరాలను మున్సిపల్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో పొందుపర్చామని, కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.

శాకంబరీదేవిగా శ్రీబాలా పార్వతి అమ్మవారు



టేకుపల్లిలో శాకంబరీదేవిగా పార్వతి అమ్మవారు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

టేకుపల్లి(మోపిదేవి): శ్రీ బాలా పార్వతి అమ్మవారు శనివారం శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. మండలంలోని టేకుపల్లి గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ కంచి కామకోటి పీఠస్థ బాలా పార్వతీ సమేత రామేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా శాకంబరీ ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు లంకా ప్రసాద్, అర్చకులు పిల్లలమర్రి శాస్త్రి నిర్వహణలో ఉదయం రామేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెచ్చిన కూరగాయలు, పండ్లతో మాలలుగా కట్టి శాకంబరీ దేవిగా శ్రీ పార్వతి అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి అష్టోత్తర శత నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించి, అనంతరం తీర్థప్రసాద వితరణ చేపట్టారు.

మురుగునీరు పారేందుకు చర్యలు

గూడూరు: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. గూడూరులోని ఇందిరమ్మ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. నీరు బయటకు పోవడానికి మురుగు కాల్వల్లో పూడిక మేటలు వేసి ఉండటంతో నాలుగు రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు శనివారం జేసీబీ సహాయంతో మురుగుకాల్వల్లోని పూడిక తీత పనులు చేపట్టారు. అంతేకాకుండా లజ్జబండ మురుగు కాల్వలో గుర్రపుడెక్క పంట పొలాల్లో నీరు బయటకు పోయేందుకు మార్గం లేకుండా పోయింది. దీంతో ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు మురళీకృష్ణ, కిరణ్‌బాబులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితి సమీక్షించారు. స్థానిక రైతుల సహాయంతో తూములకు అడ్డుగా ఉన్న గుర్రపుడెక్కను తొలగించడంతో నీటి ప్రవాహం పెరిగింది. కాల్వ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గుర్రపుడెక్క తొలగింపు చర్యలు చేపడతామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ డీసీ చైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి, మాజీ సర్పంచి పోతన రామోజీ, లింగం విజయ్, డొక్కు నాగరాజు, గూడూరు పంచాయతీ అధికారి భాస్కరరావు, వీఆర్వో కరీముల్లా, రైతులు పాల్గొన్నారు.



లజ్జబండ కాల్వలో గుర్రపు డెక్కను రైతులతో తొలగింప చేస్తున్న అధికారులు

ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు



చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం సాయంత్రం క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భారీ వర్షాలు, వరదలు పట్ల తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొని జిల్లాలోని పరిస్థితులను మంత్రికి వివరించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అధిక వర్షాలకు ఘంటసాల మండలం పాప వినాశనం గ్రామంలో మొవ్వ కోటేశ్వరికి చెందిన పక్కా గృహం గోడలు బలహీనంగా ఉండటం వల్ల గోడలు కూలాయని, ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదన్నారు. అదేవిధంగా కోడూరు మండలంలోని మాచవరం గ్రామంలో ముళ్లపూడి వెంకటేశ్వరరావుకి చెందిన పశువుల పాక కూలిపోవడంతో ఒక ఎద్దు చనిపోయినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బాలాజీ, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ దుర్గా కిషోర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా గుర్రపుడెక్క తొలగింపు



గుండేరు డ్రెయిన్‌లో తొలగిస్తున్న గుర్రపుడెక్క

- 'సాక్షి' కథనానికి స్పందించిన డ్రెయినేజీ శాఖాధికారులు
- కృతజ్ఞతలు తెలిపిన రైతులు

సాక్షి ఎఫెక్ట్..

ఘంటసాల: భారీ వర్షాలకు గుండేరు డ్రెయిన్ పొంగిపొర్లడంతో డ్రెయిన్‌లో నిండిపోయిన గుర్రపుడెక్క రైతులను ఆందోళనకు గురిచేస్తోందంటూ గుదిబండగా గుర్రపుడెక్క అనే కథనాన్ని సాక్షి పత్రికలో శుక్రవారం ప్రచురించింది. దీనిపై స్పందించిన డ్రెయినేజీ శాఖాధికారుల ఆదేశాల మేరకు ఏఈ కె.హరీష్ ఘంటసాల మండల పరిధిలోని గుండేరు డ్రెయిన్‌పై చిట్టూర్పు - ఘంటసాలపాలెం మధ్యలోని జోడుగూడెం - చాట్రగడ్డవానిగూడెం వంతెన వద్ద, ఘంటసాల - దేవరకోట, ఘంటసాల - బిరుదుగడ్డ, దాలిపర్రు - లక్ష్మీపురం గ్రామాల మధ్య గుండేరు పై ఉన్న వంతెనల వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటకాడను తొలగించేందుకు 25 మంది కూలీలు, రెండు పొక్లెయిన్ల సాయంతో శనివారం చర్యలు చేపట్టారు. ఆయా పనులు వేగవంతంగా జరిగేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి రైతులకు ఇబ్బందుల్లేకుండా పనులు చేపడుతున్నట్లు ఏఈ హరీష్ తెలిపారు. తద్వారా సుమారు 15 వేల ఎకరాల పంట ముంపునకు గురికాకుండా ఉంటుంది. డ్రెయినేజీ శాఖాధికారులు తక్షణమే స్పందించి గుర్రపుడెక్క తొలగించేందుకు కృషి చేసిన సాక్షి కథనానికి, పనులు చేపడుతున్న అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



గుర్రపుడెక్క తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఏఈ హరీష్, రైతులు

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచి మచిలీపట్నం వారు ఇచ్చిన లోగటా ప్రకారం యావన్మందికీ తెలియునది ఏమనగా.. ఈ క్రింది షెడ్యూలులో చూపిన కుక్కల బాల సుబ్రహ్మణ్యం గారి భార్య కుక్కల స్వాతి మిథిల గారి స్థిరాస్తిని రిజిష్టర్ తనఖా చేసుకుని ఋణము ఇచ్చుటకు నిర్ణయించి ఉన్నాము. కావున సదరు వ్యవహారానికి సంబంధించి ఎవరికైనను ఎటువంటి అభ్యంతరాలు గానీ, జప్తులు, ఛార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదాలు ఉన్న యెడల నేటి నుండి 7 రోజులలోపు ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరాలకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూల్ : కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్‌రిజిష్ట్రార్ వారి ఋలాకా, మచిలీపట్నం టౌన్, ఇనుగుదురు పేటలోని మున్సిపల్ వార్డు నెం. 29, డోర్ నెం. 29/170-29కు ఖ చెందిన దస్తావేజు నెం. 5872/2021లో 100 చ॥గజాల ఖాళీ నివేశన స్థలానికి హద్దులు. తూర్పు : నా తాలూకు స్థలం 23.4 అ॥లు, దక్షిణం : నా తాలూకు స్థలం 34 అ॥లు, పడమర: ఎస్. గంగాధరరావు స్థలం 31.9 అ॥లు, ఉత్తరం: మున్సిపల్ రోడ్డు 31.10 అ॥లు.

యమ్.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది, మచిలీపట్నం

ఘనంగా రక్షణ సైన్యం సంస్థాపన దినోత్సవం

నాగాయలంక: రక్షణ సైన్యం(సాల్వేషన్ ఆర్మీ) నాగాయలంక డీఓ ఆధ్వర్యంలో స్థానిక రాజేశ్వరి కాలనీ చర్చి ఆవరణలో సంస్థ ఇండియా సెంట్రల్ టెర్రిటరీ 129వ సంస్థాపన దినోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. రక్షణసైన్యం జిల్లా అధికారి మేజర్ తెలగతోటి ప్రసాదరావు మాట్లాడుతూ మద్రాసు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న తెలుగు గడ్డపై 1895లో విజయవాడలో తొలుత స్టాఫ్ కెప్టెన్ అబ్దుల్ అజీజ్ ఈ సంస్థను ప్రారంభించారన్నారు. ప్రస్తుతం 700లకు పైగా గ్రామాల్లో హీనస్థితిలో ఉన్న వేలాది మంది అభాగ్యుల సేవలకు సంస్థ అంకితమై పని చేస్తోందని చెప్పారు. సంస్థ అందిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. ఈసందర్భంగా సంస్థ మరింత ఉన్నతికై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకు ముందు ఉదయం బోసుబొమ్మ సెంటర్‌లోని సంస్థ కార్యాలయంలో రక్షణ సైన్యం పతాకం ఎగురవేశారు. మహిళా విభాగం జిల్లా అధికారి మేజర్ దీనరత్నకుమారి, మేజర్ జి.రత్నం, మేజర్ డి.ప్రమీరాసుందరి, కెప్టెన్ కెజియాకుమారి, లెఫ్టినెంట్ వి.రవి, వి.వరకుమారి, డి.జాన్‌రాజు, డి.ఉష, సీహెచ్.అనిల్‌కుమార్, వకీలదేవి, రాజా, వసంతకుమార్ తదితర నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



రక్షణసైన్యం పతాకం ఎగురవేసిన డీఓ ప్రసాదరావు, రక్షణసైన్యం ప్రతినిధులు

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

న్యాయమూర్తి కె.శ్రీహరి

ఉయ్యూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి సూచించారు. న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు ప్రాంగణం నుంచి ప్రధాన సెంటరు వరకూ హెల్మెట్‌లతో ర్యాలీ చేస్తూ అవగాహన కల్పించారు. అనంతరం న్యాయమూర్తి శ్రీహరి మాట్లాడుతూ హెల్మెట్ ధారణ విధిగా తీసుకుని ప్రాణాలను రక్షించుకోవాలన్నారు. వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరిస్తే ప్రాణ రక్షణకు ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపిచంద్, ఉపాధ్యక్షుడు పల్లి అశోక్, ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్, ప్రతినిధులు సూర్యనారాయణ, వసుధారాణి, చంటిబాబు, నాగేశ్వరరావు, ఎస్‌ఐలు గణేష్‌కుమార్, అవినాష్, శ్రీనివాస్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ ప్రత్యేక అధికారిగా రాము



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రత్యేక అధికారిగా సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.రాము శనివారం బాధ్యతలు స్వీకరించారు. పాలకవర్గం రాజీనామా చేసిన నేపథ్యంలో రామును ప్రత్యేక అధికారిగా నియమిస్తూ డీసీవో చంద్రశేఖరరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

గోసాలలో అమ్మవారికి గాజుల అలంకరణ

పెనమలూరు: గోసాల గ్రామం వైకుంఠపురంలో వేం చేసి ఉన్న శ్రీకనకదుర్గ మల్లేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేసిన అనంతరం శనివారం ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని గాజులతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com